# సమిధ

పట్టణానికి దూరంగావున్న మామిడితోట నందన. నందనలో ఫ్లీట్ వోనర్ శ్రీపతి ఈమధ్యనే కట్టించిన ది గార్డన్ హౌస్. అతి ముఖ్య అతిథులు యిందులో దిగుతారు. యెన్నో రకాల వ్యాపార, రాజకీయ నిర్ణయాలు యిందులో జరుగుతాయి. అందువల్ల తరచూ శ్రీపతి యీ గార్డన్ హవుస్‌కు వస్తుంటాడు. హైసొసైటీలో అందమైన భార్య సోషల్ స్టేటస్‌నూ, ప్రిస్టేజ్‌నీ పెంచుతుందంటారు. కాబట్టి శ్రీపతి వెంట మిసెస్ జయాశ్రీపతి సాధారణంగా వుంటుంది.

ది గార్డన్ హవుస్‌లో. మధ్య హాల్లో. మధ్యతరగతి మనసుల్లాంటి మెత్తమెత్తటి సోఫాలమీద వొకరోజున-

గృహమేధి శ్రీపతి తెల్లటి సిల్కు దుస్తుల్లో మహారాజులా వున్నాడు. మిసెస్ శ్రీపతి పరపరలాడే కంచిపట్టు పీతాంబరాల్లో మహారాణిలావుంది ఆనాటి అతిథిదేవుడు చంద్రశేఖరం; ఐ.యే.యస్.. ది డిస్ట్రిక్టు కలెక్టర్ దొరవారు. రాక రాక గృహస్థును పావనం చేయడానికి అడవి నుంచి వచ్చిన అపర ఋషిపుంగవుడిలా వున్నాడు.

శాంతంగా. గంభీరంగా, టీపాయిమీదున్న లైఫ్ మాగజైన్‌లోని బొమ్మల్ని ముసిముసి నవ్వుల్తో పలకరిస్తూ.

"యిపుడే మొదలుపెడితే బావుంటుందేమో! కాస్త స్లోగా వెళ్ళవచ్చు- మీకభ్యంతరం లేదనుకుంటాను" - శ్రీపతి నవ్వుతూ చంద్రశేఖరాన్ని పలకరించాడు. శ్రీపతి నవ్వు వరాలమూట.

మిసెస్ శ్రీపతి వైపుచూస్తూ, చంద్రశేఖరం అన్నాడు:

"నా జెటాల్. మిసెస్ జయగారికి అభ్యంతరం వుంటేతప్ప!"

యేమంటారన్నట్లు చంద్రశేఖరం తల యెగరేశాడు.

మిసెస్ శ్రీపతికి అభ్యంతరం లేదు. సూచనగా కళ్ళతో నవ్వింది. మాటల్లో యింగ్లీషు అమితంగా దొర్లే సభ్య సమాజంలో ఆమె చాల తక్కువగా మాట్లాడుతుంది. యెక్కువ సభ్యతను ప్రదర్శిస్తుంది.

సేజన్ను స్టఫ్‌ను కాక్ టెయిల్‌చేసి, మూడు గ్లాసులు నింపి, అయిసు ముక్కల్ని అతి సుకుమారంగా జారవిడుస్తోంది.

మిసెస్ జయకు వయసులేదు. షీమైట్ నాట్ బి మోర్ దాన్ థర్టీ. నలభైయని యెవరో బుద్ధిలేని ఆఫీసరు ఫ్రెండ్సన్నారు- మిసెస్ శ్రీపతిని చంద్రశేఖరం మనస్సులో మెచ్చుకున్నాడు.

చీర్స్ తర్వాత ముగ్గురు సిప్ చేస్తున్నారు.

మిసెస్ జయగారూ మార్వెలెస్‌గా కాక్‌టెయిల్ చేస్తారు. అమెరికాలో ప్రతియింట్లో ప్రత్యేకమైన కాక్‌టెయిల్ మెథడ్స్‌వున్నాయంటారు. మేరీ మెకార్థీ ''గ్రూప్'' లో ననుకుంటాను, కాక్

టెయిల్స్ ప్రస్తావన గొప్పగా వుంది. అయినా మీదగ్గర యీ ఆర్ట్ నేర్చుకోవాలి. యిఫ్ యు డోంట్ మైండ్ మీరెక్కడ నేర్చుకున్నారు?"

చంద్రశేఖరం. తనకు సాహిత్య సంస్కారమూ. కళాభిరుచీ వున్నాయని వ్యక్తపరిచాడు.

మిసెస్ శ్రీపతి సిప్‌చేసి. పెదాలను నాజూగ్గా నాలికతో తడుపుకొని. స్నాక్‌ను మునిపంట కొరికి అంది:

"పీసుకోర్సులో యిక్కడికొచ్చిన వొక అమెరికా ఫ్రెండు మనింట్లో కొన్నాళ్లుంది. తాను నేర్పింది. కాక్ టెయిల్‌పై కొన్ని పుస్తకాలుకూడ వున్నాయి."

ఆ పుస్తకాల పేర్లు ఆమె చెప్పలేదు.

"మీవంటి వాళ్ళుండబట్టి కల్చర్ కొంతయినా యీ దేశంలో మిగిలింది. లేక పోతే యీ డర్టీ కంట్రీలో యేముంది? నాటు మనుషులు! యెవడికన్నా ఆర్టిస్టిక్ అవుట్ లుక్ వుందా? యీ మొనాటనస్ లైఫ్ యెంతబోరు! నాటుబ్రతుకు!"

చంద్రశేఖరానికి ఆసమయంలో తాగుడు యిష్టంలేని ధర్మపత్ని జ్ఞాపకానికి వచ్చింది. ఐ. యె. యెస్. రాకమునుపు జీవితం గుర్తుకొచ్చింది. దేశంమీద అసహ్యం ముంచుకొచ్చింది. గ్లాసు వొక్క పట్టులో ఖాళీ అయింది.

చంద్రశేఖరం కాస్తా జోరుగా పట్టే రకమే అని అనుకున్నాడు శ్రీపతి.

"ప్లీస్ గో స్లో" శ్రీపతి మందహాసంతో హెచ్చరించాడు.

"నో....నో....డ్రింక్ లైక్ యె రోమన్. ముస్సోరీలో వొక మేజర్ నన్నొకమారు పార్టీకి పిలిచి అదిరిపొయ్యాడు. వాడేమన్నాడో తెలుసా? 'మాన్! టెరిబుల్ మాన్! గన్ బ్యారల్లావున్నా యు డ్రింక్ లైక్ ఫిష్!' అన్నాడు. అర్ధరాత్రికి అవుటయ్యాడు. తాగలేక పడిపొయ్యాడు. పోటీ పళ్లేక వోడిపొయ్యాడు. ఐ వన్! యె బిగ్ విక్టరీ!"

కలెక్టర్ చంద్రశేఖరం. మూడవ రౌండులో బిగ్గరగా నవ్వి తన పానశక్తికి వొక తార్కాణాన్ని చూపెట్టాడు:

టేప్ రికార్డరులోంచి మంద మందంగా క్రిస్టీన్ కీలర్ స్వీట్ సెక్సీ హమ్మింగ్ విన్పిస్తోంది. చంద్రశేఖరం మత్తు నరాలు శివాలు తొక్కుతున్నాయి. గదిలో విద్యుద్దీపాల మసక వెన్నెల. కిటికీల్లోంచి జారుతూ. కాక్‌టెయిల్ వాసనలో కలిసిన తోటగాలి. గది బయట నిశ్శబ్ద రహస్య వాతావరణం.

సోఫా ప్రక్కన అందమైన స్టూలుమీదున్న గాజు బొమ్మను యెడమ చేతికి తీసుకొని చంద్రశేఖరం కవిత్వంలో పడ్డాడు;

"టౌనుకు దూరంగా యీ తోట. యీ లౌలీ గార్డెన్ హౌస్. మీ టేస్ట్ కమెండబుల్! యీ గాజుబొమ్మ-హాఫ్ నేకెడ్‌గావుండే యీ ఆర్టిస్టిక్ పీస్ ఆఫ్ బ్యూటీ - ఐ లైక్ యిట్ మచ్! వొక కాలిని కాస్తా యెత్తి వంచి ఆ యెత్తి వంచిన మోకాలుమీద గిటార్ పెట్టుకొని.... రియల్లీ ఐ ఫాల్ యిన్ లవ్ విత్ దిస్.... విత్ దిస్!"

చంద్రశేఖరం అభినయిస్తూ గాజుబొమ్మను పెదాలకు ఆనించుకున్నాడు. మిసెస్ శ్రీపతి చంద్రశేఖరం గ్లాసును మరోసారి అమృ

తంతో నింపి. వొక చేత్తో చంద్రశేఖరం చేతిలో వున్న బొమ్మను లలితంగా తీసి స్టూలుమీద వుంచింది. మరోచేత్తో చంద్రశేఖరానికి గ్లాసు అందించింది. చంద్రశేఖరం కృతజ్ఞత చెప్పుకున్నాడు.

మిసెస్ జయాశ్రీపతి శ్రీపతివైపు సాలోచనగా చూసి అంది:

"మీ కొత్తబస్సు రూటు సంగతేమయింది? చంద్రశేఖరంగారు యేమనుకోరు. అడగండి"

శ్రీపతి అందుకున్నాడు:

"ఆ శ్రీశైలం రూటుకు చాలా పోటీ వున్నట్లుంది."

"ఆః దట్స్ యిన్ అవర్ హాండ్స్!"

చంద్రశేఖరానికి హోదా గుర్తుకొచ్చింది. మౌనంగా తాగడంలో మళ్ళీ మునిగాడు. పక్కగదిలోంచి ఫోను మ్రోగింది. శ్రీపతి విసుగును దాచుకుంటూ అతిథిని క్షమాపణ కోరాడు:

"యెక్స్క్యూజ్ మీ. యూ బోత్ ప్లీజ్ క్యారీ ఆన్. యెక్కడున్నా యీ ఫోన్ కాల్స్ శని తప్పదు."

శ్రీపతి పక్కగదిలోకి వెళ్ళి ఫోనందుకున్నాడు.

"యెస్! శ్రీపతి స్పీకింగ్"

"నేనండీ సుబ్బరామయ్యను. సబిన్స్పెక్టర్ సుబ్బరామయ్య స్పీకింగ్!"

సుబ్బరామయ్య లాంటి చిన్న వుద్యోగి, మరీ ముఖ్యమయిన పార్టీ సమయంలో ఫోన్ చేసినందుకు శ్రీపతికి తెగమండింది. కానీ శ్రీపతి వ్యాపార హృదయం విశాలమైంది. వోపిగ్గా అడిగాడు:

"నువ్వా సుబ్బరామయ్యా! బస్సేదన్నా కావాలా? కారేమన్నా కావాలా? యింకేమయినా...."

"యిప్పటికేమీ అక్కర్లేదండీ! కొంపమునిగింది.!"

"యేమైందీ! యే బస్సుకయినా యేక్సిడెంట్ అయిందా? యెవరన్నా చావలేదుకదా? యీ ప్రొహిబిషన్ తీశేశాక మా డ్రయివరు గాడిదకొడుకులు తాగడం మరీ యెక్కువయింది- డ్యూటిలోకూడా"

"అది కాదండీ! సురేష్ వొక తంటా తెచ్చిపెట్టాడు. యీ పోలీసుద్యోగానికీ మన స్నేహానికీ పరీక్ష వచ్చింది" శ్రీపతి స్నేహం తనకెంత విలువైందో సుబ్బరామయ్య తెలియపరిచాడు.

"అసలు సంగతి చెప్పవయ్యా. నీకు కన్ఫ్యూజన్ జాస్తి. చెప్పేదేదో సూటిగా డొంకతిరుగుడు లేకుండా నిజం చెప్పు" శ్రీపతి మనసులోని ఆందోళననూ. విసుగునూ మాటల్లో దాచలేక పోయాడు.

"యెంత పోలీసోన్నయినా మీతో అబద్ధం చెప్పి బతకగలనా? సురేష్ సాయంత్రం వొక పిల్లమీద కారుపోనిచ్చాడు. యేక్సిడెంట్!"

"ఆ పిల్ల చచ్చి పోలేదుకదా!"

శ్రీపతికి మత్తు దిగసాగింది.

"అదృష్టం! ఆ పిల్ల చచ్చిపోలేదు. కొంచెంలో ప్రమాదం తప్పింది. పెద్ద దెబ్బలేమీ తగల్లేదు. కానీ షాక్ తింది. యేక్సిడెంట్ అయిన వెంటనే సురేష్ ఆ అమ్మాయిని కార్లో వేసుకొని హాస్పిటల్లో చేర్చాడు. ఫరవాలేదు. షాక్ నుంచీ తేరుకుంది. కానీ బాగా భయ

పడి పోయింది - కారుగుద్దినపుడు. యెందుకైనా మంచిదని డాక్టర్ మార్ఫీన్ యిచ్చాడు. వుదయందాకా లేవదు." సుబ్బయ్య కేసు వివరించాడు.

"యింతకూ ఆ పిల్లెవరు?" శ్రీపతి సాలోచనగా ప్రశ్నించాడు.

"ఆ కోన్ కిస్కా. మునిసిపల్ యెలిమెంట్రీ స్కూల్లో పన్జేసే అయ్యావారమ్మ కూతురు. కామధేనులో సేల్స్ గర్ల్"

శ్రీపతి నిట్టూర్చాడు.

సుబ్బరామయ్య వివరాలు చెప్పుకపోతూనే వున్నాడు.

"ఆ పిల్లేదో ప్రొవకేట్ చేసినట్లుంది. రాష్ అండ్ నెగ్లిజంట్ డ్రైవింగ్ మాత్రం కాదు. వర్రీ కావలసిన అవసరంలేదుకానీ ..."

శ్రీపతికి అంతా పీడగా వుంది. "మరి కేసు సంగతో?" అనుమానంగా అడిగాడు.

"అదే నా బాధ. కేసు తప్పని సరిగా పెట్టాల్సి వస్తుందేమో! యేక్సిడెంట్ ఆచూకీ యేమాత్రం తెలిసినా, కొత్తగా వచ్చిన యెస్పీగాడు దుంప తెంచుతాడు. యీ డైరెక్టు రిక్రూట్లతో వచ్చిన చిక్కే యిది. వాడికి డ్యూటీతప్ప అన్నమూ నీళ్లూ అఖ్ఖరలేదు. పైగాన్యాయం పిచ్చి: చార్జి తీసుకొని రెండు వారాలే అయినా మా మిండగాడై కూర్చున్నాడు. రాత్రుళ్లు నిద్ర పట్టడంలేదు. రికార్డులన్నీ తిరగదోడుతున్నాడు. వాడొక తిక్కనాకొడుకు. నోట్లకూ లొంగడు. బుద్ధికీ లొంగడు. ఆఖరుకు యెంత లావుపాటి ఖద్దరుకూ లొంగడు. డియెస్పీదాకా చిక్కేమీ వుండదనుకో...."

శ్రీపతి భయపడ్డాడు. కేసుపెడితే గొడవలు. అప్రతిష్ఠ. సుబ్బ రామయ్యగాడు యేదో కిరికిరీ చేస్తున్నాడు. మనసులోది కక్కించాలి. యెంత స్నేహితుడైనా పోలీసోణ్ని నమ్మకూడదు. శ్రీపతి విచిత్ర స్వరంతో అన్నాడు:

"సుబ్బరామయ్యా! నీ యెస్పీ సంగతి అట్లా వుంచు. వాడి సంగతి పదిరోజుల్లో తేల్తుందిలే. యిక్కడ కలెక్టరున్నాడు. కలెక్టరూ డైరెక్టు రిక్రూటేలే. నీసంగతి తేల్చు ముందు. మావాడే స్టేషను కొచ్చి రిపోర్టు చేశాడంటున్నావు. కేసు రిజిష్టరు చేసుకున్నావా? మా వానిమీద కేసు పెడతావా? అది బెయిలబుల్ అఫెన్స్ కదా? పోలీసు బుద్ధి చూపొద్దు నీకెన్నిమార్లు యెన్నివిధాల సాయం చేశానో నీకు తెల్సు. ఆ దేవుడికి తెల్సు. నాతో నీకేం పనులు పడతాయో నీకు తెలీదా. నాకు తెలీదా? నేనక్కడికి వచ్చేదా?"

సుబ్బరామయ్య కంగు తిన్నాడు. శ్రీపతి లాంటి వాళ్ళను మోసం చేయకూడదు. వాళ్ళను మోసంచేసి నెగ్గుకు రావడం అసాధ్యం. వాళ్ళ నీడన బ్రతకడం మంచిది. వాళ్ళకు విధేయులుగా, విశ్వాస పాత్రులుగా వుండడం మంచిది. వాళ్ళకు కృతజ్ఞులుగా వుండడం అన్నివిధాలా ఆరోగ్యం. పైగా కులస్తుడు. లక్షాధికారి. పలుకుబడి వున్నవాడు. సుబ్బరామయ్య తనలో అనుకొని అన్నాడు;

"నా కన్ఫ్యూజన్ నీకు తెలుసుగా! యింత గొడవాచెప్పి అసలు సంగతి చెప్పలేదు. యీ వుద్యోగంలో బుద్ధి పనిచెయ్యదు. అయినా బుద్ధి వుంటే యీ వుద్యోగం యెందుకు చేస్తాం? మరీ అంత అన్యాయంగా మాట్లాడొద్దు. పోలీసోళ్ళలో కూడా మంచివాళ్ళున్నారు.

మీవాన్ని అరెస్టూ చెయ్యలేదు. కారునూ స్టేషన్లో వుంచలేదు. అసలు కేసున్నా కేసులో మీ వాడెందుకుంటాడు? మీ పరువు నా పరువు కాదా? కేసు నడపాల్సే వస్తే డ్రైవింగ్ సీట్లో మీవాడెందుకుండాలి? అప్పుడే పకడ్బందీ చేశాన్లే. రాముడని కత్తి! పాతకేడీగాడు. మన విషయంలో నమ్మకస్తుడు. యేపని అయినా హనుమంతునిలా చేయగలిగిన నంబర్ వాన్ ఢాకూ! వాడికి డ్రైవింగ్ లైసెన్సుంది. మీ బస్సులో డ్రయివరుద్యోగం కోసం సురేష్ వెంట తిరుగుతూన్నట్లుంది. వాన్ని అరెస్టు చేశాను. బెయిలు మీదా విడిచాను. కేసంటూ జరిగితే అంతో యింతో వాడి ముఖాన తగిలేస్తే ఆర్నెళ్లు అత్తగారింట్లో అల్లెం తిని వస్తాడు. యెందుకైనా మంచిది. మునిసిపల్ చెయిర్మన్ ఫ్రెండే కాబట్టి ముందే ఆ టీచరమ్మ నోరు నొక్కించడం మంచిది. హాస్పిటల్ సూపరెండెంటు మనవాడే కాబట్టి అటువైపు యేగొడవలూ వుండవు. వుదయం యీ విషయాలు తేల్చేసుకోవచ్చు. అన్నట్లు సురేష్‌ను యిప్పుడే యింటికి పంపాను. కాస్తా గాబరా పడినట్లుంది-కొత్తకాబట్టి. మరేం భయంలేదని చెప్పాను. మీరూ చెప్పండి. మిమ్మల్ని డిస్టర్బ్ చేసినందుకు క్షమించండి. యింటికి ఫోన్ చేస్తే మీరు గార్డన్ హవుస్‌లో వున్నారని చెప్పారు. సారీ ఫర్ డిస్టర్బింగ్ యు. ఫోను పెట్టేస్తున్నాను."

శ్రీపతి నవ్వుకున్నాడు. కలవరపాటు తగ్గింది. కానీ మనసు చీకాగ్గా వుంది.

శ్రీపతి యింటికి రింగ్ చేసాడు. "సురేష్ యిప్పుడే యిల్లు చేరాడ"ని ఫోనులో జవాబు వచ్చింది. యింటికివెళ్ళి, సురేష్‌ను

మరేమీ కంగారు పడవద్దనిచెప్పి త్వరలో మళ్ళీ రావచ్చు. యెట్లాగూ కలెక్టరును యెంటర్‌టెయిన్ చెయ్యడానికి జయ వుంది.

శ్రీపతి పోర్టికోలో కొత్త అంబాసిడర్ తీశాడు. పోర్టికోలో కారు తీస్తున్న శబ్దం జయకు వినిపించింది. చంద్రశేఖరం ఉపురికార్దరు వైపు చూస్తున్నాడు. గేటుదగ్గరున్న తోటమాలి బాలయ్యతో యిపుడే వస్తానని చెప్పి శ్రీపతి యింటివైపు కారు నడిపాడు.

పార్టీ మూడ్ పాడైపోయింది. సురేష్‌కింకా పిల్లతనం పోలేదు. వీడికిదేం బుద్ధో? ఆడపిల్లల వెంటబడ్డం. వాళ్ళు రోడ్డుమీద నడుస్తుంటే కారు వాళ్ళ ప్రక్కన్నే తోలడం. వెంటవుండే రిఫ్‌రాఫ్ గాళ్ళతో నాలుగు కూతలు కూయడం తనదాకా వచ్చింది. అదేం గేం? వెధవ రోడ్డుసైడు రొమాన్స్! యేడిస్తే లోకంలో రోడ్డుమీద ఆడపిల్లలే సరసాలకు కావాలా? వీన్నని లాభంలేదు. స్టేటస్ తెలుసుకోకుండా చేసే తప్పుడు స్నేహాలవల్ల యిల్లాంటి చిక్కులు వస్తాయి. సుబ్బ రామయ్య వంటి చిన్న వుద్యోగి మొదలుకొని హైదరాబాదు వరకూ కొందరేదో మంచివాళ్ళు చేతుల్లో వుండబట్టి సరిపోయింది కానీ లేక పోతే యీ రోజుల్లో బతకడ మెంత కష్టం? ప్రతి అడ్డగాడిదా డబ్బున్నవాన్ని బజార్న పడెయ్యడానికి గుంటనక్కలా కాచుకొని వుంటాడు. డబ్బు సంపాదించే తెలివితేటలు వీడిమధ్య చూపిస్తున్నాడు కానీ యింకా యీ పిల్లచేష్టలు పోలేదు. డబ్బు సంపాదించేవాళ్ళ దృష్టి డబ్బుమీద తప్ప దేనిమీదా వుండకూడదు. డబ్బుముందు అన్ని విలువలూ దిగదిడుపే! ఆఫ్టరాల్ సెక్స్! సెక్సుకన్నా జీవితంలో సాధించవలసింది డబ్బు. డబ్బే ముఖ్యం! సెక్స్ యీజ్ యె ట్రివి యల్ థింగ్. ముఖ్యంకాదు. కానేకాదు. ఐ కేర్ యె టప్పెన్స్ ఫర్

సెక్స్. శ్రీపతి అవ్యక్తమానసం మేల్కొంది. శ్రీపతి వూరి బయటి కాలనీలోని యిల్లుచేరుకున్నాడు. డ్రాయింగ్‌రూంలో అడుగుపెట్టే వేళకు సురేష్ సోఫాలో దిగులుగా కూర్చొని వున్నాడు. ప్రక్కనే నిలబడివున్న రాముడు వినయంగా నమస్కరించాడు. సన్నగావున్నా భయంకరంగా వున్నాడు. పదునుపెట్టిన యీటెలా వున్నాడు. యెక్కుపెట్టిన విషబాణంలా వున్నాడు. తాగివున్నా నిబ్బరంగా వున్నాడు. భక్తిపూర్వకంగా రాముడు శ్రీపతికి నివేదించాడు:

"బాబు విషయం యినిస్పెట్టరు చెప్పారండీ. కేసెక్కడ వేళ పెట్టినా నామీదేకదా పెట్టేది. డ్రైవింగ్ సీట్లో నేనున్నానని కోర్టులో చెబుతానండీ! కాదనే నా కొడుకెవడు? యింతకాలం బాబూ నన్ను సాకాడు. యీ దేహం కట్టింది మీ గుడ్డ. యీ రక్తం తాగింది మీ సారాయి. మీ రుణం యిట్లా తీర్చుకుంటాను. నాకుద్యోగం యిప్పించండి. మీదగ్గర పడివుంటా! మీరు చెప్పిన పని చేస్తా" రాముడి కళ్లు కృతజ్ఞతతో నిండి వున్నాయి. రాముడి విశ్వాస పాత్రతకు శ్రీపతి కాస్త చలించాడు. యిల్లాంటి వాళ్ళుండబట్టి యీ దేశంలో యింకా కొంత విశ్వాసమూ, న్యాయమూ, ధర్మమూ వున్నాయి. అనుకున్నాడు శ్రీపతి. "సరే రాముడూ! నువ్వెళ్ళి కాస్త ఆ వరండాలో కూచో. తర్వాత చెబుతాను. బాబూతో కాస్త మాట్లాడాలి."

శ్రీపతి ఆజ్ఞను రాముడు శిరసావహించి బయటికి నడిచాడు.

సురేష్ తండ్రి వైపు చూడకుండా ముఖం తిప్పుకున్నాడు. సురేష్ తాగివున్నట్లు శ్రీపతి గ్రహించాడు. కానీ శ్రీపతికి యివి అంతగా పట్టించుకోదగ్గ విషయాలుకావు. శ్రీపతి యే తరంలోనైనా

సమాధాన పడగలడు. గొంతు సవరించుకొని శ్రీపతి సానునయంగా అన్నాడు:

"చూడు సురేష్! భయపడాల్సిందేమీ లేదు. సుబ్బరామయ్య అంతా చెప్పాడు. అన్నీ తెలిసినా నీకింకా చిన్నతనం పోలేదు. జీవితంలో సాధించాల్సినవి చాలా వున్నాయి. సెక్సుకంత యింపార్టెన్సు యివ్వకూడదు. సరే అలా వుంచు. అసలు యెందు కేక్సిడెంట్ అయింది?"

సురేష్ వుద్వేగం కట్టలు తెంచుకొంది:

"డాడీ! యిప్పుడు చెప్తుతా విను– ఆ యేక్సిడెంట్ సంగతి. దానిమీద నాకేం మోజు! కావాలని నేనే గుద్దాను. లేకపోతే అష్ట రాల్ వొక టీచరమ్మ కూతురు-అందులోనూ ఫాదరెవరో తెలీని బ్లడీ బిచ్ మనల్నంటుందా? మన కుటుంబాన్నంటుందా? మన స్టేటస్ యెక్కడ? దాని స్టేటస్ యెక్కడ? యె డర్టీ సేల్స్ గర్ల్. నెలకు నూర్రూపాయలకు అమ్ముడుపోయిన దండుముండ. యెంత తలబిరుసు దానికి? వొకటి రెండుసార్లు నేనేవో కొనుక్కోడానికి కామధేన్లో దాని కౌంటర్ దగ్గరకు వెళ్తే యెంత పొగరుగా మాట్లాడిందనుకున్నారు? హెచ్చరించా- చెడిపోతావని. యీవాళ కారును నేనేదో థింక్ చేస్తూ స్లోగా పోనిస్తుంటే అదంటుంది. దాని వెంట పడ్డానట! దాని పరువు నేను తీస్తున్నానట! నడిమంతరం సిరితో కళ్ళు కనిపించడం లేదట! నువ్వు వొకప్పుడు సుబ్బానాయుడి బస్సులో చెకింగుగా పడివుండి వాళ్ళను కూల్చి పైకొచ్చావట! నాకు తిక్కరేగి "అసలు నువ్వొక తండ్రికీ, అమ్మకూ పుట్టినట్లు అలా యెగిరి పడతావెందుకే ముండా"

అని అడిగాను. దాని జవాబు ... దాని పొగరు .... అదంటుంది: 'నీలాంటి లోఫరొకడు మా అమ్మను పెళ్ళాడతానని నమ్మించి మోస గించినంతలోనే మా అమ్మ చెడిపోయిందా? మొగుడి వ్యాపారంలో డబ్బుకోసం అడ్డమైన మొగాళ్ళతో పోయే మీ అమ్మ పతివ్రతా?' దాన్ని ప్రాణాలతో విడవకూడదని కారు గుద్దించాను. యెంత కొవ్వు దానికి?" యేం మాట్లాడేదీ తెలీని వుద్రేకంలో చెప్పుకుపోతున్నాడు సురేష్‌కి శ్రీపతి. కొడుకు యేంచెబుతున్నాడో వినపడడంలేదు. కోపంతో కంపించిపోయాడు. "లంజను యెందుకు చంపకుండా విడిచిపెట్టావు" అని అనాలకున్నాడు. కానీ మళ్ళీ తమాయించుకొని "నువ్వెళ్ళి పడుకో. దాని సంగతి నేను తేలుస్తాను" అని మాత్రం అనగలిగాడు.

నాలుగురోజులు గడిచాయి. యీ బస్సురూట్లతో బాగా విసిగి పోయానని యీ మధ్య శ్రీపతి అక్కడక్కడ అంటున్నాడు. ఆయన వ్యాపారరంగం యిప్పుడు హైదరాబాదులో వొక పరిశ్రమ స్థాపనకు విస్తరిస్తోంది. అందుకే ఆయనకు క్షణం తీరుబడిలేదు. దినపత్రికల్లో ముఖ్య శీర్షికలు మాత్రమే ఆయన చూడగలుగుతున్నాడు. నిజమే! శ్రీపతి ధన సంపాదనా నిఘంటువులో తీరిక అనే పదంలేదు. అం దుకే దినపత్రికలో వొక మూల ప్రచురింపబడిన యీ వార్తను శ్రీపతి చదివే అవకాశం లేకపోయింది.

'స్థానిక కామధేనులో సేల్స్‌గర్ల్‌గా పనిచేస్తున్న సీత అనే 20 సంవత్సరాల అమ్మాయి నాలుగు రోజుల క్రిందట వొక కారు కిందపడి ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించింది. డ్రైవరు జాగ్రత్తవల్ల ఆ ఆత్మహత్యా ప్రయత్నం విఫలమైంది. కొద్దిగాయాలు

మాత్రం తగిలాయి. కారు యజమాని ఆ అమ్మాయిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చాడు. నిన్న వుదయం ఆ అమ్మాయి నిద్ర మాత్రలు యెక్కువ తినడం వల్ల మరణించింది. ఆత్మహత్యకు కారణాలు తెలియవు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.'

వారం రోజుల తర్వాత శ్రీపతి కంపెనీకే కొత్త శ్రీశైలం రూటు మంజూరయింది. యీ బస్సు వ్యవహారాలన్నీ సురేష్ స్వయంగా చూసుకుంటున్నాడు.

"ఆంధ్ర జ్యోతి" 25 ఆగస్టు 1972.